సంప్రదాయ దినోత్సవం.. విద్యార్థుల సంబరం


సాంస్కృతిక నృత్యంలో..


వేదికపై నృత్యం చేస్తున్న విద్యార్థినులు


ఎడ్ల బండిపై బతుకమ్మ ఊరేగింపు..

హసన్‌పర్తి మండలం అనంతసాగర్ శివారులోని ఎస్సార్ విశ్వ విద్యాలయంలో శుక్రవారం సంప్రదాయ దినోత్సవం వైభవంగా నిర్వహించారు. నిత్యం పుస్తకాలతో కుస్తీ పట్టే వివిధ విభాగాల విద్యార్థులు సంప్రదాయ దుస్తుల్లో సందడి చేశారు. ఉదయం నుంచి సాయంత్రం వరకు ఉత్సవాల్లో పాల్గొన్నారు. బతుకమ్మ, సంక్రాంతి, హోలీ, దసరా తదితర పండుగల వాతావరణాన్ని తీసుకువచ్చారు. వేడుకలను విశ్వవిద్యాలయం ఉప కులపతి ప్రొఫెసర్ దీపక్ గార్గ్, రిజిస్ట్రార్ ఆర్.అర్చనారెడ్డి జ్యోతి వెలిగించి ప్రారంభించారు. - న్యూస్‌టుడే, హసన్‌పర్తి

జయజయహే జగజ్జనని


అన్నపూర్ణ అలంకరణలో భద్రకాళి మాత


ఎస్ఆర్ఆర్‌తోట శ్రీకనకదుర్గ మల్లేశ్వర స్వామి ఆలయంలో గాయత్రి రూపంలో


శివనగర్ శ్రీసీతారామచంద్రస్వామి ఆలయంలోని శ్రీలలితాదేవి అమ్మవారు

దేవీ శరన్నవరాత్రులు నగరంలో సందడిగా సాగుతున్నాయి. రెండో రోజైన శుక్రవారం భద్రకాళి ఆలయంతోపాటు, వివిధ దేవాలయాల్లో అమ్మవార్లు వివిధ రూపాల్లో దర్శనమిచ్చారు. భక్తులు తరించి తన్మయత్వంలో మునిగారు. భద్రకాళి అమ్మవారు అన్నపూర్ణ మాతగా దర్శనమిచ్చారు. ప్రధానార్చకుడు శేషు ఆధ్వర్యంలో ఉదయం బ్రహ్మచారిణి, సాయంత్రం దేవజా దుర్గా క్రమంలో పూజలు చేశారు. 11 గంటలకు అమ్మవారి ఉత్సవమూర్తికి మకర వాహనసేవ, సాయంత్రం చంద్రప్రభ వాహనసేవ నిర్వహించారు. తొగుట ఆశ్రమ పీఠాధిపతి శ్రీ మాధవానంద సరస్వతి స్వామి భద్రకాళి అమ్మవారికి పూజలు చేసి, చండీయాగంలో పాల్గొన్నారు. హనుమద్గిరి పద్మాక్షి ఆలయంలో అమ్మవారిని బ్రహ్మచారిణిగా అలంకరించి పూజించారు. ఎస్ఆర్ఆర్‌తోట శ్రీకనకదుర్గ మల్లేశ్వరస్వామి ఆలయంలో గాయత్రి అవతారంలో కనిపించారు. – న్యూస్‌టుడే, వరంగల్ సాంస్కృతికం, రంగంపేట, నయీంనగర్


బ్రహ్మచారి అలంకరణలో పద్మాక్షిదేవి..


లష్కర్ బజారులో శ్రీజగదాంబ దుర్గా ఉత్సవ సమితి ఆధ్వర్యంలో

న్యాయస్థానంలో బతుకమ్మ సంబరాలు


బతుకమ్మ ఆడుతున్న వరంగల్ జిల్లా ప్రధాన న్యాయమూర్తి నిర్మలా గీతాంబ, వరంగల్ ఎంపీ కడియం కావ్య


పాల్గొన్న మహిళా అడ్వకేట్లు, కుటుంబసభ్యులు

ఓరుగల్లు న్యాయస్థాన ప్రాంగణంలో శుక్రవారం బతుకమ్మ వేడుకలు ఘనంగా జరిగాయి. వరంగల్ జిల్లా బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో శుక్రవారం జిల్లా కోర్టు ఆవరణలో నిర్వహించిన బతుకమ్మ వేడుకలో ప్రధాన న్యాయమూర్తి వి.బి.నిర్మలాగీతాంబ, ఎంపీ కడియం కావ్య పాల్గొని సందడి చేశారు. జిల్లా ప్రధాన న్యాయమూర్తి మాట్లాడుతూ బతుకమ్మ లాంటి పర్వదినాలను జరుపుకోవటం వల్ల మన సంస్కృతి, సంప్రదాయాలను కాపాడుకోవటమే కాకుండా భావితరాలకు మంచి సందేశం అందించిన వారమవుతామన్నారు. ఈ కార్యక్రమంలో న్యాయమూర్తులు, న్యాయవాదుల సంఘం అధ్యక్షుడు తీగల జీవన్‌గౌడ్, ఇతర కార్యనిర్వాహక సభ్యులు, మహిళా న్యాయవాదులు పాల్గొన్నారు. వరంగల్ న్యాయవిభాగం, న్యూస్‌టుడే

ఎల్ఆర్ఎస్ దరఖాస్తుల పరిశీలన వేగవంతం

హనుమకొండ కలెక్టరేట్, న్యూస్‌టుడే: జిల్లాలో ఎల్ఆర్ఎస్ దరఖాస్తుల పరిశీలనను వేగవంతం చేయాలని కలెక్టర్ ప్రావీణ్య అధికారులను ఆదేశించారు. శుక్రవారం కలెక్టరేట్‌లో సంబంధిత శాఖల అధికారులతో సమీక్షించారు. ఎల్ఆర్ఎస్ ప్రక్రియ జిల్లాలో 23 బృందాలను ఏర్పాటు చేశామని, వీరు రోజుకు 20 దరఖాస్తులను క్షేత్రస్థాయిలో పరిశీలించి వాటికి సంబంధించిన వివరాలతో నివేదికను అందించాలని ఆదేశించారు. కార్యక్రమంలో డిప్యూటీ కలెక్టర్, ఎల్ఆర్ఎస్ నోడల్ అధికారి శంకర్‌కుమార్, కుడా పీవో అజిత్‌రెడ్డి, నగరపాలక అధికారులు పాల్గొన్నారు.


సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ ప్రావీణ్య

ధాన్యం కొనుగోలు కేంద్రాల ఏర్పాటుకు చర్యలు

హనుమకొండ కలెక్టరేట్ : జిల్లాలో ఖరీఫ్‌కు సంబంధించి ధాన్యం కొనుగోలు కేంద్రాల ఏర్పాటుకు చర్యలు చేపట్టాలని కలెక్టర్ ప్రావీణ్య అన్నారు. కలెక్టరేట్‌లో సంబంధిత అధికారులతో సమీక్షించారు. కొనుగోలు కేంద్రాల వద్ద సమస్యలు, ఇబ్బందులపై ఫిర్యాదు చేసేందుకు టోల్ ఫ్రీ నెంబర్ ఏర్పాటు చేయాలని సూచించారు. కేంద్రాల నిర్వాహకులకు శిక్షణ ఇవ్వాలని, డాటా ఎంట్రీ ఆపరేటర్లను ఎంపిక చేసుకోవాలని చెప్పారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ వెంకట్‌రెడ్డి, ఆర్డీవోలు వెంకటేష్, నారాయణ, వ్యవసాయ, పౌర సరఫరాల శాఖల అధికారులు పాల్గొన్నారు.

8వ తేదీలోగా సర్వే పూర్తి చేయండి

పరకాల, న్యూస్‌టుడే: అన్ని వివరాలతో కుటుంబ డిజిటల్ కార్డు సర్వేను పూర్తి చేయాలని కలెక్టర్ ప్రావీణ్య సూచించారు. పరకాల మున్సిపాలిటీలోని 8వ వార్డులో శుక్రవారం నాలుగు బృందాలు సర్వేను ప్రారంభించగా కలెక్టర్ పరిశీలించారు. ఇంటింటికీ తిరిగి వివరాలను నమోదు చేయాలని సిబ్బందికి సూచించారు. ఈ నెల 8వ తేదీలోగా సర్వేను పూర్తి చేయాలన్నారు. పట్టణ ఆరోగ్యకేంద్రం కోసం భూపాలపల్లి రోడ్డులోని పాత పోస్టుమార్టం స్థలాన్ని ఆమె పరిశీలించారు. ఆ స్థలాన్ని రెడ్‌క్రాస్ సొసైటీకి ఇచ్చినట్లు తెలుసుకున్నారు. ఆర్డీవో నారాయణ, తహసీల్దార్ భాస్కర్, కమిషనర్ నర్సింహ, ఎంపీడీవో పెద్ది ఆంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

నాలుగు కొలువులతో సత్తా చాటాడు

యువ


మెట్టుపల్లి రవీందర్

కమలాపూర్ మండలంలోని అంబాల గ్రామానికి చెందిన మెట్టుపల్లి రవీందర్ వరుసగా ఆర్నెళ్ల వ్యవధిలో నాలుగు ఉద్యోగాలు సాధించి సత్తా చాటారు. నిరుపేద దళిత కుటుంబానికి చెందిన రవీందర్ ఈ ఏడాది మార్చిలో వెలువడిన గురుకుల ఫలితాల్లో టీజీటీ, పీజీటీ, గురుకుల జూనియర్ లెక్చరర్‌గా మూడు ఉద్యోగాలు సాధించారు. ప్రస్తుతం భద్రాచలం మైనారిటీ గురుకుల బాలుర కళాశాలలో పౌరశాస్త్ర అధ్యాపకుడిగా పని చేస్తున్నారు. ఇటీవల వెలువడిన డీఎస్సీ ఫలితాల్లో స్కూల్ అసిస్టెంట్ సోషల్ స్టడీస్ విభాగంలోనూ కొలుగు రావడంతో నాలుగు ఉద్యోగాలు సాధించిన ఘనతను సొంతం చేసుకున్నారు. శుక్రవారం ధ్రువపత్రాల పరిశీలన అనంతరం అతను 'న్యూస్‌టుడే'తో మాట్లాడారు. తల్లికి ఇచ్చిన మాట మేరకు ప్రభుత్వ ఉద్యోగాలు సాధించానన్నారు. **- న్యూస్‌టుడే, కమలాపూర్**

బల్దియా ఆరోగ్యాధికారిగా డాక్టర్ రాజారెడ్డి



కార్పొరేషన్, న్యూస్‌టుడే: పాత సారొచ్చారు. .గ్రేటర్ వరంగల్ ప్రజారోగ్య విభాగం ముఖ్య ఆరోగ్యాధికారి(సీఎంహెచ్‌వో)గా బి. రాజా రెడ్డి శుక్రవారం బాధ్యతలు చేపట్టారు. మేయర్ గుండు సుధారాణి, కమిషనర్ డాక్టర్ అశ్విని తానాజీ వాకడేను మర్యాద పూర్వకంగా కలిశారు. గతంలో ఐదారేళ్లపాటు పనిచేసిన అనుభవం ఉండటంతో ఆయన్ను విధుల్లోకి తీసుకున్నారని తెలిసింది. అధికార పార్టీకి చెందిన ఓ ప్రజాప్రతినిధి, పాలకవర్గం పెద్దల ఆశీస్సులతో వచ్చారని ప్రచారం జరుగుతోంది. గతంలో బదిలీపై వెళ్లిన ఆరోగ్యాధికారులెవరూ తిరిగి బల్దియాకు వచ్చేందుకు సాహసించలేదు. డాక్టర్ రాజారెడ్డి కావాలనే మళ్లీ సీఎంహెచ్‌గా ఇక్కడికి వచ్చారని తెలిసింది. 2021లో 452 మంది తాత్కాలిక కార్మికుల నియామకాల్లో చక్రం తిప్పారనే ఆపవాదు ఉంది. త్వరలో 250 మంది తాత్కాలిక కార్మికుల నియామకాలు జరగనున్నాయి. మళ్లీ ఏం జరుగుతుందోనని చర్చించుకుంటున్నారు. శుక్రవారం బల్దియా ఉద్యోగ, కార్మిక సంఘాల ప్రతినిధులు రాజారెడ్డిని కలిసి అభినందించారు.

పారిశుద్ధ్యం మెరుగయ్యేనా?: గత కొన్ని నెలలుగా నగరంలోని 66 డివిజన్లలో పారిశుద్ధ్యం పనులు అధ్వానంగా ఉన్నాయని ఎమ్మెల్యేలు, కార్పొరేటర్లు పలుమార్లు కౌన్సిల్ సమావేశాల్లో ప్రస్తావించారు. ఏడాదిన్నర నుంచి సీఎంహెచ్‌గా డాక్టర్ రాజేష్ ఉన్నారు. క్షేత్రస్థాయిలో తిరగడం లేదనే విమర్శలు వచ్చాయి. కొంత మంది శానిటరీ ఇన్‌స్పెక్టర్లు, జవాన్ల నిర్వాకంతో పారిశుద్ధ్యం పనులు గాడి తప్పాయి. చాలా డివిజన్లలో అనధికార జవాన్లు కొనసాగుతున్నారు. 450- 500 మంది కార్మికులు పనిచేయకుండానే జీతాలు పొందుతున్నారని తెలిసింది. కొత్తగా విధుల్లో చేరిన డాక్టర్ రాజారెడ్డికి ఇలాంటి పెనుసవాళ్లు ముందున్నాయి.

రైతు ధర్నా విజయవంతం..

భారాస శ్రేణుల్లో ఉత్తేజం

తొర్రూరు, న్యూస్‌టుడే: ఎలాంటి షరతులు లేకుండా రైతులందరికీ రూ.2 లక్షల వరకు రుణ మాఫీ చేయాలని భారాస నేతలు కాంగ్రెస్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మహబూబాబాద్ జిల్లా తొర్రూరు డివిజన్ కేంద్రంలోని అమ్మాపురం క్రాస్ రోడ్డు వద్ద శుక్రవారం నిర్వహించిన రైతు మహా ధర్నా విజయవంతం కావడం ఆ పార్టీ శ్రేణుల్లో ఉత్సాహం నింపింది. వేలాదిగా తరలివచ్చిన రైతులతో ధర్నా ప్రాంగణం కిక్కిరిసి పోయింది. మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు అధ్యక్షతన నిర్వహించిన ధర్నాలో ముఖ్య అతిథిగా మాజీమంత్రి హరీశ్‌రావు హాజరయ్యారు. ధర్నాలో ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వ విధానాలపై తీవ్ర స్థాయిలో మండిపడ్డారు. ఆరు గ్యారంటీలు అమలుచేయాల్సిందేనని స్పష్టం చేశారు. అనంతరం ఉమ్మడి జిల్లాకు చెందిన పార్టీ కీలక నేతలు ప్రసంగించారు.


మాట్లాడుతున్న మాజీ మంత్రి హరీశ్‌రావు, వేదికపై పార్టీ నాయకులు


సభకు హాజరైన రైతులు

☛ రైతులకు ఏక కాలంలో రూ.2 లక్షల రుణమాఫీ, ఎకరానికి రూ.15 వేలు రైతు భరోసా, వరి ధాన్యానికి రూ.500 బోనస్ అంటూ బోగస్ మాటలు చెప్పిన మోసకారి ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి. 11 పర్యాయాలు రూ.72 వేల కోట్ల రైతుబంధును అందించిన ఘనత భారాస ప్రభుత్వానికే దక్కుతుంది.
- పల్లా రాజేశ్వర్‌రెడ్డి, జనగామ ఎమ్మెల్యే

☛ తొర్రూరులో గురువారం ఓ వస్త్ర దుకాణం ప్రారంభోత్సవంలో వేదిక కూలిపోయిన మాదిరిగానే కాంగ్రెస్ ప్రభుత్వం కూలిపోతుంది. హైడ్రా పేరుతో హైదరాబాద్‌లో విధ్వంసం సృష్టిస్తున్నారు. ఆరు గ్యారంటీలను అమలు చేసే వరకు కాంగ్రెస్ ప్రభుత్వం వెంటపడి వేటాడుతాం.
- స్థానిక సంస్థల ఎమ్మెల్సీ పోచంపల్లి శ్రీనివాసరెడ్డి

☛ ఇచ్చిన హామీలను అమలు చేయకుండా తుంగలో తొక్కి రాష్ట్రంలో దుర్మార్గ పాలన కొనసాగిస్తున్నారు. రుణ మాఫీపై వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు, సీఎం రేవంత్‌రెడ్డిలు పొంతనలేని లెక్కలు చెబుతున్నారు. ఈ ప్రభుత్వానికి గుణపాఠం తప్పదు.
- శాసనమండలి ప్రతిపక్ష నేత సిరికొండ మధుసూదనాచారి

☛ నేటికి 30 శాతం మంది రైతులకు కూడా రుణమాఫీ కాలేదు. సీఎం రేవంత్‌రెడ్డి బ్రోకర్ మాటలు చెబుతూ ప్రజలను మోసం చేస్తున్నారు. తొర్రూరులో 100 పడకల ఆసుపత్రి, పాలకుర్తిలో 50 పడకల ఆసుపత్రి పనుల ఊసేలేదు. ఇచ్చిన హామీలను అమలు చేసేంత వరకు ప్రభుత్వంపై పోరాడుతూనే ఉంటాం.
- మాజీమంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు

రోజూ నీటి సరఫరా చేయాలి

కార్పొరేషన్, న్యూస్‌టుడే: పండగల సమయంలో ప్రతి రోజూ తాగు నీరు ఇవ్వాల్సిందేనని మేయర్ గుండు సుధారాణి ఇంజినీర్లను ఆదేశించారు. శుక్రవారం దేశాయిపేట ఫిల్టర్‌బెడ్‌ను తనిఖీ చేశారు. ధర్మసాగర్ చెరువు నుంచి వస్తున్న రా వాటర్‌ను ఎలా శుద్ధి చేస్తున్నారని ఇంజినీర్లను మేయర్ సుధారాణి అడిగి తెలుసుకున్నారు.

చేప ఎదగాలంటే.. చెరువు బాగుండాలి!


గుర్రపు డెక్క..పిచ్చి మొక్కలతో నిండిన చెరువు


చేపా చేపా నువ్వెందుకు ఎండావు అంటే.. చెరువులో ప్రాణవాయువు లేదందట. ప్రాణవాయువునడిగితే చెరువు నిండా మురుగు, గుర్రపుడెక్క ఉంటే నాకు చోటేదీ అందట.. చాలా తటాకాల పరిస్థితి ఇలానే ఉంది. హనుమకొండలోని వడ్డేపల్లి చెరువులో శుక్రవారం ఒకవైపు చేప పిల్లలను వదలగా, సమీపంలోనే మురుగు, గుర్రపుడెక్కతో నిండి కనిపించింది. ప్రభుత్వం చేపట్టిన మంచి కార్యక్రమం విజయవంతమై మత్స్యకారులకు చేపలు అందాలంటే చెరువులను కూడా పరిశుభ్రంగా ఉంచాలని పర్యావరణవేత్తలు చెబుతున్నారు. - ఈనాడు, హనుమకొండ


శుక్రవారం వడ్డేపల్లి చెరువులో చేప పిల్లలను వదులుతున్న ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి

ఆర్టీసీలో మహాలక్ష్మి!



● సంస్థ అభివృద్ధిలో కీలకపాత్ర



డిపోల వారీగా ● మహిళా కండక్టర్లు, ● సిబ్బంది

డిపో	మహిళా కండక్టర్లు	సిబ్బంది
వరంగల్ I	48	04
వరంగల్ 2	71	04
హనుమకొండ	112	04
జనగామ	55	01
నర్సంపేట	57	03
మహబూబాబాద్	28	02
పరకాల	37	04
భూపాలపల్లి	27	–
తొర్రూరు	43	05
ఆర్.ఎం కార్యాలయం	01	05

ఆర్టీసీ నష్టాల నుంచి లాభాల బాట పట్టింది. ప్రభుత్వం ప్రవేశపెట్టిన మహాలక్ష్మి పథకంతో మహిళలకు ఉచిత బస్సు ప్రయాణ సౌకర్యం కల్పించడంతో ఆదాయం రెట్టింపయ్యింది. అధికారులు సంస్థను అభివృద్ధిలోకి తీసుకురావడానికి అహర్నిశలు కృషి చేస్తున్నారు. వరంగల్ రీజయన్ పరిధిలో ఉత్తమ సేవలతో పాటు మంచి లాభాలు ఆర్జించడంలో మహిళా ఉద్యోగులు కీలక పాత్ర పోషిస్తున్నారు. కండక్టర్ నుంచి ఉన్నతాధికారుల వరకు అన్ని విభాగాల్లో సత్తా చాటుతున్నారు.

హనుమకొండ కలెక్టరేట్, న్యూస్‌టుడే

ఉమ్మడి జిల్లాలోని తొమ్మిది డిపోల పరిధిలో మహిళా కండక్టర్లు 479 మంది ఉన్నారు. ఇతర విభాగాల్లో పని చేసే వారు మరో 32 మంది ఉంటారు. వీరిలో ప్రధానంగా వరంగల్ 2, జనగామ, తొర్రూరు, నర్సంపేట డిపో మేనేజర్లు జ్యోత్స్న, స్వాతి, పద్మావతి, ప్రసూనలక్ష్మీ, వరంగల్ 2 డిపో అసిస్టెంట్ మేనేజర్ జ్యోత్స్న, హనుమకొండ డిపోలో నాజియా, ఆర్ఎం కార్యాలయంలో సరస్వతి, పరకాలలో కృష్ణకుమారి, నర్సంపేటలో భవానీ, తొర్రూరులో రజిత, ఎంఫ్‌లు వరంగల్ 2 డిపోలో అమల, పరకాలలో రాజశ్రీ, ఆర్ఎం కార్యాలయంలో మహిళలు కీలక పదవుల్లో ఉండి ఆర్టీసీ అభివృద్ధికి కృషి చేస్తున్నారు.



మహిళా శక్తి ఇలా..

● పల్లెవెలుగు, ఎక్స్‌ప్రెస్ బస్సుల్లో ఎక్కువ మంది మహిళా కండక్టర్లే విధులు నిర్వహిస్తున్నారు.

● ఆర్టీసీలో కార్మికులు తమ సమస్యలను పరిష్కరించుకునేందుకు ఉన్నతాధికారులు ప్రతి డిపోకు ఇద్దరు సభ్యులతో కూడిన సంక్షేమ బోర్డులను ఏర్పాటు చేశారు. ఈ కమిటీలో ఉమ్మడి జిల్లాలోని 9 డిపోల్లో ఒక పురుషుడితో పాటు ఒక మహిళ సభ్యులుగా ఉన్నారు. తొర్రూరు, పరకాల, వరంగల్ 2, జనగామ డిపోల్లో ఇద్దరు సభ్యులు మహిళలే ఉన్నారు. వీరు డిపోల స్థాయిలో కార్మికులు, సిబ్బంది ఎదుర్కొంటున్న సమస్యలను డీఎం, ఆర్ఎంలకు చేరవేసి వాటి పరిష్కారం దిశగా కృషి చేస్తున్నారు.

● రీజియన్‌లో మహిళా సిబ్బంది విశ్రాంతి తీసుకునేందుకు ప్రతి డిపోలో ప్రత్యేకంగా విశ్రాంతి గదులను ఏర్పాటు చేశారు. మహిళల ఆరోగ్య పరిరక్షణకు ప్రతి డిపోలో ఇద్దరు సహాయకులు సైతం ఉంటారు. వీరు మహిళా సిబ్బందికి వారానికి, నెలకోసారి వైద్య పరీక్షలు నిర్వహిస్తూ అవసరమైన వారికి హనుమకొండలోని డిస్పెన్సరీ నుంచి మందులు, తార్నాకలోని ఆర్టీసీ ఆసుపత్రిలో అధునాతన చికిత్స అందించేలా కృషి చేస్తున్నారు.



వరంగల్ I డిపోలో మహిళల కోసం ఏర్పాటు చేసిన విశ్రాంతి గది

ఈ సేవలు అందిస్తే మేలు

- రోజుకు 8 గంటల పని దినం కల్పించాలి
- రాత్రి 8 గంటల వరకు తప్పని సరిగా విధులు ముగిసేలా చర్యలు తీసుకోవాలి.
- ప్రతి నెలా ఆరోగ్య సమస్యలకు మూడు రోజుల పాటు వేతనంతో కూడిన సెలవు మంజూరు చేయాలి.
- పని ఒత్తిడి నివారణకు సిబ్బంది, బస్సుల సంఖ్యను పెంచాలి.
- సిటీ బస్సుల్లో మాదిరిగా స్టాండింగ్ అలవెన్స్‌లు అందించాలి.
- స్పెషల్ ఆఫ్ డ్యూటీ (ఒక రోజు విధులు నిర్వహిస్తే మరో రోజు సెలవు వచ్చేలా) విధులు కేటాయించాలి.

ఉన్నతాధికారుల సహకారంతో ..



- జ్యోత్స్న, డిపో మేనేజర్, వరంగల్ 2

ఆర్టీసీ ఉన్నతాధికారుల ప్రోత్సాహంతో డిపో అభివృద్ధికి కృషి చేస్తున్నాం. వారి సూచనలను ఎప్పటికప్పుడు అమలు చేస్తూ ముందుకు సాగుతున్నాం. మహిళా సిబ్బంది పురుషులతో సమానంగా విధులు నిర్వహిస్తూ డిపో అభివృద్ధికి పాటు పడుతున్నారు.

సంస్థ అభివృద్ధికి కృషి చేస్తున్నాం.



- బి.సుధారాణి, కండక్టర్ వరంగల్ I

మహాలక్ష్మి పథకం వచ్చాక బస్సుల్లో ప్రయాణికుల సంఖ్య భారీగా పెరిగింది. దీంతో కొంత ఒత్తిడితో పాటు అనారోగ్యానికి గురవుతున్నాం. అయినప్పటికీ సంస్థను తమ సొంతంగా భావించి దాని అభివృద్ధికి కృషి చేస్తున్నాం. రద్దీని తట్టుకుంటూ విధులు నిర్వహిస్తున్నాం. మా డిపో మేనేజర్ సూచనలతో ఇబ్బందులు లేకుండా పని చేస్తున్నాం.

పనిభారం ఉన్నా సమర్థంగా విధులు



- రజిత, ట్రాఫిక్ ఎస్టీఐ, తొర్రూరు డిపో

ఆర్టీసీ బస్సుల్లో మహిళా ప్రయాణికుల సంఖ్య విపరీతంగా పెరిగింది. దీంతో మహిళా కండక్టర్లు ఒత్తిడికి గురవుతున్నారు. పని భారం పెరుగుతున్నా సమర్థంగా విధులు నిర్వహిస్తున్నారు. వారికి కేటాయించిన టార్గెట్ పూర్తి చేస్తున్నారు. సంస్థ లాభాల్లో వారి కృషి కీలకం.



త్రివేణి సంగమం

● మరో 8 నెలల్లో

సరస్వతి పుష్కరాలు

● ఇప్పటి నుంచే ఏర్పాట్లు చేస్తే మేలు

న్యూస్‌టుడే, కాళేశ్వరం: జయశంకర్ భూపాలపల్లి జిల్లా కాళేశ్వర క్షేత్రం వద్ద అంతర్వాహినిగా పేరున్న సరస్వతి నదికి మరో ఎనిమిది నెలల్లో పుష్కరాలు రాబోతున్నాయి. ప్రతి పన్నెండేళ్లకోసారి వచ్చే సరస్వతి పుష్కరాలు వచ్చే ఏడాది మే 15 నుంచి 26 వరకు జరుగుతాయి. 2013లో ఈ నదికి పుష్కరాలు జరిగాయి. కాళేశ్వరం క్షేత్రంలో మూడు నదులు కలుస్తాయి. దీన్ని త్రివేణి సంగమంగా పిలుస్తారు. ఎగువ నుంచి గోదావరి, మహారాష్ట్ర నుంచి ప్రాణహిత నదుల ప్రవాహం రాగా కాళేశ్వరాలయంలోని ద్విలింగాలకు జలాభిషేకం చేసిన నీరు అంతర్వాహినిగా రెండు నదుల్లో కలుస్తుందని పురాణాల్లో ఉంది. 2015లో గోదావరి, 2022లో ప్రాణహిత పుష్కరాలు జరిగాయి. మరోనది సరస్వతికి పుష్కర కాలం సమీపించింది. గతంలో జరిగిన సరస్వతి పుష్కరాల్లో గోదావరి, ప్రాణహిత కలయిక ప్రవాహంలో లక్షల మంది భక్తులు పుణ్యస్నానాలు ఆచరించారు. ఈసారి మరో 8 నెలల సమయమే ఉన్నందున అటు దేవస్థానం అధికారులు, ఇటు ఇతర అధికారులు ముందస్తు ప్రణాళికలు, ప్రతిపాదనలు సిద్ధం చేసుకుంటే భక్తులకు మెరుగైన సదుపాయాలు కల్పించొచ్చు.

పూర్తి చేయాల్సిన పనులు..



అసంపూర్తిగా ఉన్న 100 గదుల విశ్రాంతి భవన నిర్మాణం

- గత ఎనిమిదేళ్లుగా అసంపూర్తిగా ఉన్న 100 గదుల విశ్రాంతి భవన నిర్మాణం పూర్తి చేయాల్సి ఉంది. నిధుల లేమితో నిర్మాణాలు ఆగిపోగా పంచాయతీరాజ్ అధికారులు గతేడాది అక్టోబర్‌లో మరో రూ.1.5 కోట్ల కోసం జిల్లా పాలనాధికారికి లేఖ పంపించారు. ఇది అందుబాటులోకి వస్తే భక్తులకు సౌకర్యంగా ఉంటుంది.
- 2013 సరస్వతి పుష్కరాల సమయంలో ప్రయాణ ప్రాంగణం నుంచి గోదావరి వరకు ప్రధాన రహదారిని విస్తరించాలని నిర్ణయించారు. ప్రాణహిత పుష్కరాలకు ముందు ఏర్పాట్లు జరిగినా కొందరు అడ్డు తగలడంతో ఆగిపోయింది. మంత్రి శ్రీధర్‌బాబు చొరవ తీసుకుంటే విస్తరణ పనులు సకాలంలో పూర్తయి భక్తుల రాకపోకలకు ఇబ్బంది ఏర్పడదు. మంత్రి శ్రీధర్‌బాబు కాళేశ్వర క్షేత్రాన్ని మరింత అభివృద్ధి చేస్తామని పలుమార్లు హామీలిచ్చారు. పుష్కరాల నేపథ్యంలో అధికారులు వెంటనే అభివృద్ధి పనులకు ప్రతిపాదనలను సిద్ధం చేసి ప్రభుత్వానికి నివేదిక నివేదించాలి. తదనుగుణంగా సకాలంలో పనులను పూర్తి చేయడానికి వీలు కలుగుతుంది.
- ప్రముఖుల ఘాట్ వద్ద అంతర్వాహిణిగా సరస్వతి నది ప్రవహించి రెండు నదుల్లో కలుస్తుందని నానుడి ఉంది. ఆ ప్రాంతంలో పుష్కర ఘాట్ నిర్మాణాలు చేపట్టాలి.
- మండు వేసవిలో పుష్కరాలు రానుండగా భారీ సంఖ్యలో గోదావరి తీరంలో, ఆలయ పరిసర ప్రాంతాలలో చలువ పందిళ్లు ఏర్పాటు చేయాలి.
- ప్రధాన ఆలయానికి సమీపంలోని గుండం చెరువును ఆధునికీకరిస్తామని పలుమార్లు నాయకులు చెబుతున్నా పనులు సాగడం లేదు. వెంటనే గుండం చెరువును మినీ ట్యాంక్‌బండ్ మాదిరిగా నిర్మాణాలు చేపట్టాలి.

విస్తృత ప్రచారం జరగాలి

సరస్వతి నది పుష్కరాలపై దేవస్థానం అధికారులు విస్తృత ప్రచారం చేపట్టాల్సి ఉంది. దేశం నలుమూలల తెలిసేలా వివిధ ప్రసార మాధ్యమాల ద్వారా ప్రచారం జరగాలని స్థానికులు, భక్తులు కోరుతున్నారు. గత మంగళవారం పుష్కర ఏర్పాట్లపై దేవాదాయశాఖ ముఖ్య కార్యదర్శి శైలజరామయ్యర్, కమిషనర్ హన్మంతరావు సమీక్ష నిర్వహించారు. ఈ నేపథ్యంలో పనుల పురోగతిపై దృష్టి సారించాల్సిన అవసరం ఉంది. 2013లో జరిగిన సరస్వతి పుష్కరాలకు మొదటి నాలుగు రోజులు భక్తుల సంఖ్య కేవలం వందకు పరిమితం కాగా అయిదో రోజు నుంచి పుంజుకొని వేల మంది భక్తులు పుణ్యస్నానాలు చేశారు. రాబోయే పుష్కరాలపై ఇప్పటి నుంచే ప్రచారం చేయాల్సిన అవసరం ఉంది.

అవివాహితులకు సువర్ణావకాశం

● నేడు, రేపు ఎస్టీ (బంజార/లంబాడ) కులాల వధూవరులకు

ఈనాడు పెళ్లిపందిరి డాట్ నెట్ ఉచిత నమోదు



బాలసముద్రం, న్యూస్‌టుడే : తెలుగింటి వివాహ పరిచయాలకు ఆత్మీయ వేదిక అయిన 'ఈనాడు పెళ్లిపందిరి' వేదికగా సువర్ణ అవకాశం కల్పిస్తోంది. ఎస్టీ (బంజారా/లంబాడ) కులాలకు చెందిన అవివాహిత వధూవరుల కోసం ఉచిత ప్రొఫైల్ రిజిస్ట్రేషన్ కార్యక్రమాన్ని నిర్వహిస్తోంది. హనుమకొండ బాలసముద్రంలోని 'ఈనాడు' కార్యాలయంలో శని, ఆదివారాల్లో ఈ కార్యక్రమం చేపట్టింది. వివాహం కోసం ఎదురు చూస్తున్న వధూవరులు లేదా సంబంధిత కుటుంబీకులు ఉదయం 9 నుంచి సాయంత్రం 5:30 గంటలలోపు ఈ కార్యక్రమంలో పాల్గొని ఉచితంగా వివరాలను నమోదు చేసుకోవచ్చు. ఫోన్ ద్వారా నమోదు చేసుకునే వారు తమ బయోడేటా, ఫొటోలను 83744 45190, 80080 02165 నెంబర్లకు వాట్సాప్ ద్వారా పంపవచ్చు. మరిన్ని వివరాలకు ఇవే ఫోన్ నంబర్లలో సంప్రదించవచ్చు.

ముగ్గురు న్యాయమూర్తులకు పదోన్నతి

వరంగల్ న్యాయవిభాగం, న్యూస్‌టుడే: ఉమ్మడి జిల్లాలో పనిచేస్తున్న ముగ్గురు జూనియర్ సివిల్ జడ్జిలకు సీనియర్ సివిల్ జడ్జిలుగా పదోన్నతి లభించింది. వరంగల్ జిల్లా నర్సంపేట ప్రధాన జూనియర్ సివిల్ జడ్జి పి. శిరీష పదోన్నతిపై సికింద్రాబాద్ సిటీ సివిల్ న్యాయస్థాన ప్రాంగణంలోని 14వ అదనపు కోర్టు జడ్జిగా వెళ్తున్నారు. ములుగు జిల్లా ప్రధాన జూనియర్ సివిల్ జడ్జి డి.రామ్మోహన్‌రెడ్డి మంచిర్యాల జిల్లా ప్రధాన సీనియర్ సివిల్ జడ్జిగా పదోన్నతిపై వెళ్తున్నారు. జనగామ సీనియర్ సివిల్ జడ్జి సి.విక్రం అదే జిల్లా న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శిగా నియమితులయ్యారు. ఆయన స్థానంలో జనగామ ప్రధాన జూనియర్ సివిల్ జడ్జి ఇ.సుచరిత పదోన్నతిపై వస్తున్నారు. వరంగల్ సీనియర్ సివిల్ జడ్జి ఎం.సాయికుమార్ అదే జిల్లా న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శిగా నియమితులయ్యారు. ఆయన స్థానంలో యాదాద్రి భువనగిరి జిల్లా రామన్నపేట ప్రధాన జూనియర్ సివిల్ జడ్జి ఎ.ప్రదీప్ పదోన్నతిపై వస్తున్నారు. హనుమకొండ జిల్లా ప్రధాన సీనియర్ సివిల్ జడ్జి క్షమాదేశ్ పాండే అదే జిల్లా న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శిగా వెళ్తున్నారు. ఆమె స్థానంలో హనుమకొండ మొదటి అదనపు సీనియర్ సివిల్ జడ్జి జాబిశెట్టి ఉపేందర్‌రావు వస్తున్నారు. రంగారెడ్డి ప్రధాన జూనియర్ సివిల్ జడ్జి వి.ఉషాక్రాంతి పదోన్నతిపై హనుమకొండ జిల్లా మొదటి అదనపు సీనియర్ సివిల్ జడ్జిగా వస్తున్నారు. యాదాద్రి భువనగిరి జిల్లా రామన్నపేట అదనపు జూనియర్ సివిల్ జడ్జి సంపత్‌రావు చందన హనుమకొండ జిల్లా రెండో అదనపు సీనియర్ సివిల్ జడ్జిగా నియమితులయ్యారు.

కాంగ్రెస్ సీనియర్ నేత నూకల నరేశ్‌రెడ్డి కన్నుమూత



మరిపెడ, న్యూస్‌టుడే: కాంగ్రెస్ సీనియర్ నాయకుడు నూకల నరేశ్ రెడ్డి (73) శుక్రవారం కన్నుమూశారు. మరిపెడ మండలం పురుషోత్తమయాగూడెం గ్రామానికి చెందిన నరేశ్ రెడ్డి వారం రోజుల క్రితం గుండె సంబంధిత సమస్యతో హైదరాబాద్ ప్రైవేటు ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. డోర్నకల్ శాసనసభ నియోజకవర్గంలో క్రియాశీల రాజకీయాల్లో ఉంటూ మాజీ ఎమ్మెల్యే రెడ్యానాయక్‌కు ప్రధాన ప్రత్యర్థిగా రాజకీయాల్లో కొనసాగారు. తెలంగాణ ఉద్యమ సమయంలో భారాసలో చేరారు. లోక్‌సభ ఎన్నికలకు ముందు కాంగ్రెస్ పార్టీలో చేరారు.

● పురుషోత్తమాయగూడెంలోని ఏరువాక వ్యవసాయ క్షేత్రంలో నరేష్‌రెడ్డి అంత్యక్రియలు శనివారం నిర్వహించనున్నారు. డోర్నకల్ ఎమ్మెల్యే రామచంద్రునాయక్, జిల్లా ఎస్పీ రాంనాథ్ కేకన్ అంత్యక్రియల ఏర్పాట్లను పర్యవేక్షించారు. ఆయన మృతి పట్ల ఉమ్మడి జిల్లా కాంగ్రెస్ నేతలు సంతాపం ప్రకటించారు.

చికెన్ ధరలు

(కిలో వెల రూపాయలలో)

వెన్‌కాబ్

ఫాం:	114
రిటైల్:	136
డ్రెస్డ్:	197
స్కిన్‌లెస్:	224

కవుల రాగమై .. జీవన గానమై..!

● బతుకమ్మ పాటల్లో గొప్ప సందేశం

ప్రపంచంలో ఎక్కడా లేని విధంగా పూలను పూజించే అత్యంత పవిత్రమైన పండగ బతుకమ్మ. మహిళలంతా రంగురంగుల పూలతో పేర్చిన బతుకమ్మలను పూజిస్తూ.. ఆటపాటలతో మురిసిపోతారు. ఆ పాటల వెనుక ఎంతో అర్థముంది. ఇవి జానపదాలతో పాటు కవులు, గాయకుల కలం నుంచి జాలువారి ప్రజలను అలరిస్తున్నాయి.. పాటల చరణాల్లోని బావుకత, పూల సొగసుల వర్ణన, జీవన పరమార్థం, ప్రకృతి దేవతల ఆరాధన, సందేశాలు.. ఇలా ఎన్నో దాగి ఉన్నాయి.. మానుకోట, న్యూస్‌టుడే



హనుమకొండ భీమారంలోని ఎస్సార్ విశ్వవిద్యాలయంలో బతుకమ్మ ఆడుతున్న విద్యార్థినులు, అధ్యాపకులు

ఆప్యాయత..

'మా ఇంటి ఆడపడుచువు
అమ్మా.. ఓ బతుకమ్మా
మా పల్లె పూల జల్లువు
అమ్మా.. బతుకమ్మా..
తెలంగాణ మురిసె..
మా చెల్లెలంతా.. మా అక్క
లంతా.. మా అమ్మలంతా
బతుకమ్మలాడా..'



- మహబూబాబాద్ జిల్లా కేంద్రానికి చెందిన ప్రజాగాయకుడు, వాగ్గేయకారుడు గొడిశాల జయరాజు ఈ పాట రాశారు.

● తన పాటలో బతుకమ్మ వేడుకల వేళ ఆడపడుచుల ఆనందాన్ని.. పూల పర్వదిన సౌందర్యాన్ని వర్ణించారు.

పూల తహతహ..!

'బతుకమ్మ పండగొస్తే
పూవులన్నీ నవ్వుతాయి..
గడ్డిపూలు గంతులేస్తయ్.. తంగేడు
పూలు తెంపమంటయ్
నునుపుగున్న గునుగు పూలు
గుసగుసలు చెబుతాయి
చెరువులోని తామరలు
తెంపమంటూ తొంగుతాయి
బతుకమ్మ పండుగొస్తెరా.. మా పల్లె తల్లి
పుత్తడి బొమ్మయి పోవురా..
నా తెలంగాణ తల్లి పుత్తడి బొమ్మయి పోవురా..



మహబూబాబాద్ జిల్లా కేంద్రానికి చెందిన గాయకుడు, గేయ రచయిత కందుల ప్రేంకుమార్ ఈ పాట రాశారు.

● ప్రకృతిలోని రంగు రంగుల పూలు బతుకమ్మలో తమను కూడా చేర్చాలని.. పేర్చాలని.. కోరుకుంటాయని ప్రేంకుమార్ పూల తహతహలను వర్ణించారు. ఒక్కో పువ్వును వర్ణించారు.

ఊరూవాడ కలిసేలా..

'సింగిడిలో.. సింగిడిలో
రంగులన్నీ నేలకొచ్చేనా..
రంగు రంగు పువ్వులయి
ఏకమయ్యేనా.. చెరువంతా
మెరిసేనా..
ఊరువాడా కలిసి.. బతుకమ్మలా పేర్చి
ముత్తయిదువులంతా కలిసి గౌరమ్మను కొలిసెనే..
అందాల పూవులన్నీ ఊయలలూగెనా
మందార పూలన్నీ కోలాటమాడెనా
తామర పువ్వులన్నీ తనువు తడిసెనా
గులాబీ పువ్వులన్నీ పొద్దయిపొడిసెనా
ఊరువాడా కలిసి మొక్కులన్నీ తీర్చి..



● మహబూబాబాద్ జిల్లా కేంద్రానికి చెందిన తెలుగు ఉపాధ్యాయుడు, గాయకుడు అక్షరం ప్రభాకర్ బతుకుతెరువునిచ్చే బతుకమ్మ అంటూ పాటలు రాశారు. నింగిలోని ఇంద్రధనుస్సు బతుకమ్మను చూడడానికి ఒక్కొక్క పూవుగా నేలకు వచ్చినట్లు ఈ పాటలో వివరించారు. పండగ వేళ ఊరంతా ఎలా ఆనందంలో తేలిపోతారో తెలియజేశారు.

సామూహిక అత్యాచార నిందితుల అరెస్టు



అరెస్టు వివరాలు వెల్లడిస్తున్న ఏసీపీ నందిరాంనాయక్

మట్టెవాడ, న్యూస్‌టుడే: వరంగల్ నగరంలో యువతిపై సామూహిక అత్యాచారానికి పాల్పడిన ముగ్గురు యువకులను ఇంతేజార్‌గంజ్ ఠాణా పోలీసులు అరెస్టు చేశారు. శుక్రవారం వరంగల్ ఏసీపీ నందిరాం నాయక్ అరెస్టు వివరాలు వెల్లడించారు. భూపాలపల్లి హనుమాన్‌నగర్‌కు చెందిన తాటి శివరాజ్ కుమార్, పుట్టపాక శరత్ స్నేహితులు. శరత్ ద్వారా బాధిత యువతి మూడు సంవత్సరాల క్రితం శివరాజ్‌కుమార్‌కు పరిచయమైంది. నర్సంపేట లక్నేపల్లిలోని బాలాజీ ఇంజనీరింగ్ కళాశాలలో శివరాజ్‌కుమార్, గోదావరిఖనికి చెందిన కొడం వివేక్ బీటెక్ చదువుతున్నారు. ప్రధాన నిందితుడు శివరాజ్‌కుమార్, గోదావరిఖనికి చెందిన కూచన మణిదీప్ కుటుంబాల మధ్య స్నేహం ఉంది. ఈక్రమంలో శివరాజ్‌కుమార్ ఇటీవల బాధిత యువతికి తన ప్రేమ విషయాన్ని తెలుపగా ఆమె నిరాకరించి స్నేహితులుగా ఉందామని చెప్పింది. దీంతో యువతిని ఎలాగైనా శారీరకంగా లోబరుచుకోవాలని శివరాజ్‌కుమార్ ఆలోచించాడు. గత నెల 15న శివకుమార్, వివేక్‌లను కలవడానికి మణిదీప్ బిట్స్ కళాశాలకు వచ్చాడు. ముగ్గురు కలిసి ఉండగా శివకుమార్ తన కోరికను వెలిబుచ్చాడు. దీంతో ముగ్గురు కలిసి నగర శివారులో యువతి చదువుతున్న కళాశాలకు వచ్చారు. బాధిత యువతికి శివరాజ్‌కుమార్ ఫోన్ చేసి గుడికి వెళ్దామని చెప్పి కారులో ఎక్కించుకున్నారు. అప్పటికే కారులో మరో ఇద్దరు యువకులు మణిదీప్, వివేక్‌లను చూసి గుడికి వచ్చేందుకు నిరాకరించింది. దీంతో ఆమెను బలవంతంగా ఎక్కించుకున్నారు. వరంగల్ పోచమ్మ మైదాన్‌లోని ఓ మద్యం దుకాణంలో బీర్లు కొనుగోలు చేశారు. అక్కడి నుంచి వరంగల్ కూరగాయల మార్కెట్ వద్ద గల ఓ లాడ్జికి తీసుకెళ్లారు. యువతికి మద్యం తాగించి లాడ్జిలో ఒకరి తర్వాత ఒకరు అత్యాచారానికి పాల్పడ్డారు. యువతి అరుపులతో లాడ్జి సిబ్బంది వచ్చి ప్రశ్నించగా గది నుంచి యువతి, ముగ్గురు యువకులు వెళ్లిపోయారు. అత్యాచారం విషయాన్ని ఎవరికైనా చెబితే చంపేస్తామని ఆమెను బెదిరించారు. కళాశాలలో పరీక్షల అనంతరం ఇంటికి వెళ్లిన యువతి అత్యాచారం విషయాన్ని తల్లికి చెప్పగా ఈ నెల 1న ఇంతేజార్‌గంజ్ ఠాణాలో ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసిన పోలీసులు సీఐ మచ్చ శివకుమార్ ఆధ్వర్యంలో దర్యాప్తు చేపట్టారు. గురువారం నర్సంపేట మహేశ్వరం వెళ్లే ఓ కచ్చా రోడ్డు వద్ద ముగ్గురు యువకులను అరెస్టు చేశారు. మణిదీప్‌కు చెందిన కారు, మూడు చరవాణిలను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు.

దినదిన గండం.. ఇళ్లపైనే యమపాశం



గ్రేటర్ వరంగల్ పరిధిలోని 65వ డివిజన్ ఆలియా తండాలో విద్యుత్తు తీగలు ప్రమాదకరంగా ఉన్నాయి. వ్యవసాయ బోరు మోటార్ల కనెక్షన్ కోసం వేసిన లైన్లు నివాసాల మధ్య ఇళ్లపై నుంచి వెళ్తున్నాయి. ఊహ తెలియని చిన్నారులు ఇళ్లపైకి ఎక్కితే ప్రమాదానికి గురయ్యే అవకాశాలు ఉన్నాయి. చింతగట్టు సబ్‌స్టేషన్ పరిధిలోని విద్యుత్తు అధికారులకు పలుమార్లు విన్నవించామని తండా వాసులు తెలిపారు. ఉన్నతాధికారులు పరిశీలించి లైన్ మార్చాలని కోరుతున్నారు. – న్యూస్‌టుడే, బాలసముద్రం

పొంచి ఉన్న ప్రమాదం



ఆత్మకూరులోని పాత మండల పరిషత్ కార్యాలయ భవనంలో అంగన్‌వాడీ కేంద్రం నిర్వహిస్తున్నారు. ఈ భవనం శిథిలావస్థకు చేరడంతో ప్రమాదకరంగా మారింది. దీనికి తోడు భవనం గోడలపై చెట్లు పెరుగుతుండడంతో కూలిపోయే అవకాశం ఉంది. ఈ విషయాన్ని అధికారుల దృష్టికి తీసుకెళ్లినా పట్టించుకోవడం లేదని సిబ్బంది వాపోతున్నారు.

– న్యూస్‌టుడే, ఆత్మకూరు (పరకాల)

ఎస్సీ వర్గీకరణ జరగకుండా ఉద్యోగాల భర్తీ తగదు



కార్యవర్గ సమావేశంలో మాట్లాడుతున్న నరేష్

న్యూశాయంపేట, న్యూస్‌టుడే: సుప్రీం కోర్టు తీర్పును స్వాగతించి ఇచ్చిన ప్రతి నోటిఫికేషన్‌లో ఎస్సీ వర్గీకరణ చేస్తామని అసెంబ్లీలో హామీ ఇచ్చిన సీఎం రేవంత్‌రెడ్డి టీచర్ పోస్టుల భర్తీని చేయడమంటే మాదిగలకు ద్రోహం చేయడమేనని, ఇది తగదని ఎమ్మార్పీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు గోవింద్ నరేష్ అన్నారు. సీఎం వైఖరిని నిరశిస్తూ ఎమ్మార్పీఎస్ ఆధ్వర్యంలో ఈ నెల 9న రాష్ట్ర వ్యాప్తంగా నిరసన కార్యక్రమాలు చేపట్టనున్నట్లు చెప్పారు. శుక్రవారం న్యూశాయంపేటలో ఎమ్మార్పీఎస్ అనుబంధ సంఘాల సమావేశాన్ని జిల్లా అధ్యక్షుడు గద్దల సుకుమార్ అధ్యక్షతన నిర్వహించారు. ఎమ్మార్పీఎస్, ఎంఎస్పీ నాయకులు జన్ను దినేష్, సురేందర్, నారాయణ, శ్రీనివాస్, రాజారపు భిక్షపతి, శాంతి సాగర్, వెంకటస్వామి, సంపత్, రవీందర్, మహేష్, పవన్, శ్రీనాథ్ పాల్గొన్నారు.

మేమున్నాం.. మీకు తోడుగా

(10 AM TO 1 PM)
జులైవాడ 9059585150
బాలసముద్రం 81438 11118
పరకాల 9849211303

హనుమకొండ చౌరస్తా, న్యూస్‌టుడే : నగరంలోని 4వ డివిజన్ మాదిరెడ్డి కుంటలో అక్రమ నిర్మాణాన్ని కూల్చి, వ్యర్థాలను అక్కడే వదిలేశారు. వెంటనే తరలించాలి.

- ఎస్.రాజమణి, మాదిరెడ్డికుంట

రెండు రోజుల్లో తొలగిస్తాం.

- బి.నరేందర్, శానిటరీ పర్యవేక్షకుడు

భీమారం, న్యూస్‌టుడే : భీమారంలోని పాతవాడ కాలనీలో రోడ్లకు ఇరువైపులా గడ్డి, పిచ్చి మొక్కలు పెరిగాయి. శుభ్రం చేయించండి. **- జానకి, భీమారం**

పారిశుద్ధ్య కార్మికులను అప్రమత్తం చేసి సమస్యను పరిష్కరిస్తాం. **- రేణుకుంట్ల సురేశ్, జవాన్**

ధర్మసాగర్, న్యూస్‌టుడే: మండలంలోని నారాయణగిరిలో ప్రధాన రహదారికి ఇరువైపుల ఉన్న మురుగు కాలువలు కూరుకపోయినాయి. **- సదానందం, నారాయణగిరి**

వారం రోజుల్లో మురుగు కాలువలకు మరమ్మత్తులు చేపడుతాం. **- రమేష్, పంచాయతీ కార్యదర్శి**

చిరుధాన్యాల ప్రాధాన్యాన్ని తెలుసుకోవాలి

హనుమకొండ చౌరస్తా, న్యూస్‌టుడే : మనం తీసుకునే ఆహారంపైనే ఆరోగ్యం ఆధారపడి ఉంటుందని లోడీ సొసైటీ డైరెక్టర్ ఫాదర్ ఇన్నారెడ్డి అన్నారు. మిల్లెట్స్‌పై కొన్ని సంవత్సరాలుగా ప్రజల్లో అవగాహన కల్పిస్తున్న రికార్డ్ నర్సిస్ సొసైటీ ఆధ్వర్యంలో శుక్రవారం కుమార్‌పల్లి మార్కెట్ రోడ్డులో ఏర్పాటు చేసిన అవుట్‌లెట్‌ను ప్రారంభించి మాట్లాడారు. చిరుధాన్యాల ప్రాధాన్యాన్ని తెలుసుకొని ప్రతి రోజు మనం తినే ఆహారంలో అవి ఉండేలా చూసుకోవాలన్నారు. కార్యక్రమంలో మిల్లెట్ ప్రమోటర్, సామాజిక కర్త శ్రీనివాస్, కుసుమ రమేష్, ప్రకాశ్, శ్రీవాత్సవ్, హర్షిత తదితరులు పాల్గొన్నారు.

భక్తితో చేసే పూజలు భగవంతుడికి చేరుతాయి

కాజీపేట టౌన్, న్యూస్‌టుడే: భక్తితో సమర్పించే ఒక్క పుష్పమైనా భగవంతుడికి చేరి నిజమైన ముక్తి లభిస్తుందని తోగుట గురు మాధవానంద సరస్వతి పీఠాధిపతులు మాధవానంద సరస్వతిస్వామి అన్నారు. కాజీపేట విష్ణుపురిలోని శ్వేతార్క గణపతి ఆలయాన్ని శుక్రవారం ఆయన దర్శించుకొని, ఆధ్యాత్మిక ప్రవచనమిచ్చారు. రోజంతా అధర్మం, అపచారం చేసి సాయంత్రం భగవంతుడి దగ్గరకు వచ్చి దండాలు పెడితే ప్రయోజనం శూన్యమన్నారు. సాటి మనిషిని ప్రేమించినపుడే జీవితం సాఫల్యం అవుతుందన్నారు. కార్యక్రమంలో ఆలయ వ్యవస్థాపకులు అనిల్ రాధాకృష్ణశర్మ, సాయికృష్ణశర్మ, మేనేజర్ రవి, పీఆర్‌ఓ మణి పాల్గొన్నారు.

మతాల మధ్య చిచ్చు పెడుతున్నారు

ఐనవోలు, న్యూస్‌టుడే: కేంద్రంలో భాజపా అధికారంలో వచ్చాక మతాల మధ్య చిచ్చు పెడుతున్నారని సీపీఎం జిల్లా కార్యదర్శి బొట్ల చక్రపాణి ఆరోపించారు. శుక్రవారం ముల్కలగూడెంలో నిర్వహించిన పార్టీ గ్రామసభలో ఆయన పాల్గొని మాట్లాడారు. ముందుగా సీతారాం ఏచూరి మృతికి సంతాపం తెలిపారు. అనంతరం మాట్లాడుతూ.. రైతులకు రూ.2 లక్షల రుణమాఫీ చేయడంలో సీఎం రేవంత్‌రెడ్డి పూర్తిగా విఫలమయ్యారని విమర్శించారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఆరు గ్యారంటీలను మరిచిపోయిందని ధ్వజమెత్తారు. అనంతరం గ్రామ కమిటీని ఎన్నుకున్నారు. మండల కార్యదర్శి లింగయ్య, మాజీ సర్పంచి పద్మ, నాయకులు బాబు, మహేందర్, చందయ్య, గోపాల్‌రావు, సంపత్, చిన్న మహేందర్, బాబురావు, వెంకన్న, విజయ, యూసుఫ్ పాల్గొన్నారు.

రాజ్యాంగ రక్షణకు కేవీపీఎస్ పోరాటం

కాజీపేట టౌన్, న్యూస్‌టుడే: ఆత్మగౌరవం, సమానత్వం, కుల నిర్మూలన లక్ష్యాలుగా ఆవిర్భవించిన కేవీపీఎస్ రాజ్యాంగ రక్షణకు పోరాటం చేస్తుందని కుల వివక్ష పోరాట సమితి ఉమ్మడి జిల్లా నాయకుడు కారు ఉపేందర్ అన్నారు. సంఘం వార్షికోత్సవం సందర్భంగా కాజీపేటలో శుక్రవారం జెండా ఎగురవేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఎస్సీ, ఎస్టీ ఉప ప్రణాళిక నిధులను ఆ వర్గాలకే ఖర్చు చేయాలని, ప్రైవేటు రంగంలో రిజర్వేషన్లు కల్పించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు ఓరుగంటి సాంబయ్య, నాయకులు గడ్డం అశోక్, ఆకునూరి విజయ్, రాజు, రాజమణి, స్వామి, రాజాసింగ్, జంపాల రమేశ్, సారంగపాణి తదితరులు పాల్గొన్నారు.



కాజీపేటలో జెండా ఎగురవేస్తున్న నాయకులు

వసతి గృహాం కొనసాగించాలని వినతి

ఐనవోలు, న్యూస్‌టుడే: ఎస్సీ బాలుర వసతిగృహంలో ప్రభుత్వ కార్యాలయాల ఏర్పాటుతో నిరుపేద విద్యార్థులు విద్యకు దూరమయ్యే అవకాశం ఉందని ధర్మసమాజ్ పార్టీ జిల్లా అధ్యక్షుడు మంద రమేష్ పేర్కొన్నారు. ఐనవోలు ఎస్సీ వసతి గృహంలో ప్రభుత్వ కార్యాలయాలను తొలగించాలని శుక్రవారం అదనపు కలెక్టర్ వెంకట్‌రెడ్డికి వినతి పత్రం అందజేశారు. నాయకులు ఠాగూర్, విష్ణు, ఎల్లస్వామి, ఏసోబు, కుమారస్వామి, బాబు పాల్గొన్నారు.

సారా విక్రేతలకు రూ.1.20 లక్షల జరిమానా

భీమదేవరపల్లి, న్యూస్‌టుడే: రాంనగర్ పంచాయతీ పరిధిలోని తండాలో సారా విక్రయిస్తున్న భూక్య లక్ష్మి, రమ, కనకమ్మ, తేజావత్ మీనాలకు తహసీల్దారు ప్రవీణ్‌కుమార్ ఒక్కొక్కరికి రూ.30 వేల చొప్పున మొత్తం రూ.1.20 లక్షల జరిమానా విధించినట్లు ఎక్సైజ్ సీఐ చంద్రమోహన్ శుక్రవారం తెలిపారు. గతంలో నలుగురు సారా విక్రయించగా పట్టుకొని తహసీల్దార్ ఎదుట బైండోవర్ చేశామని, మళ్లీ గత నెల 29న విక్రయిస్తుండగా పట్టుకొని తహసీల్దార్ ముందు హాజరుపర్చగా జరిమానా విధించినట్లు ఆయన తెలిపారు.

అలుగు స్వాధీనం.. ముగ్గురు స్మగ్లర్ల అరెస్టు



న్యూశాయంపేట, న్యూస్‌టుడే: ముగ్గురు స్మగ్లర్లను అదుపులోకి తీసుకొని, వారి నుంచి అరుదైన వన్యప్రాణి అలుగును స్వాధీనం చేసుకున్నట్లు హనుమకొండ, జనగామ జిల్లాల అటవీశాఖ అధికారి లావణ్య తెలిపారు. భూపాలపల్లి జిల్లాలో అలుగు విక్రయానికి సంబంధించి కొందరు ఆన్‌లైన్‌లో పెట్టడంతో చెన్నైలోని వైల్డ్‌లైఫ్ క్రైం కంట్రోల్ బ్యూరో గుర్తించింది. వెంటనే ప్రాంతీయ ఉప సంచాలకుడు డాక్టర్ కృపాశంకర్ హనుమకొండ అటవీశాఖ, వైల్డ్ లైఫ్ క్రైం కంట్రోల్ అధికారులను అప్రమత్తం చేశారు. అటవీ క్షేత్రాధికారి భిక్షపతి, డీఆర్వో మోహన్, రతన్‌లాల్, బలరామకృష్ణ వ్యూహంపన్ని జయశంకర్ భూపాలపల్లి జిల్లా కాటారం మండలం కొత్తపల్లికి చెందిన తాటి రాజు, ఇబ్రహీంపట్నం గ్రామానికి చెందిన అవ్జుద్‌ఖాన్, మహాముత్తారం మండలం యామన్‌పల్లికి చెందిన మహ్మద్‌నజీర్‌లను శుక్రవారం కాటారం వద్ద అరెస్టు చేశారు.

గంజాయి...

భీమదేవరపల్లి : ముగ్గురు అనుమానితుల నుంచి గంజాయిని స్వాధీనం చేసుకున్నట్లు వంగర ఎస్ఐ దివ్య తెలిపారు. ఆమె కథనం ప్రకారం.. ముగ్గురు వ్యక్తులు గంజాయితో వెళ్తున్నట్లు విశ్వసనీయ సమాచారం రావడంతో టాస్క్‌ఫోర్స్, వంగర పోలీసులు శుక్రవారం సంయుక్తంగా రాంనగర్ శివారులో వాహన తనిఖీ చేపట్టారు. మహారాష్ట్రలోని జాల్నా గ్రామానికి చెందిన ప్రదీప్ ఆసరామ్ సుల్మాడి, ఒడిశా రాష్ట్రం కొరపుటులోని సేనిలిగూడకు చెందిన సుజల్ కుల్దిపియా, బబ్లూ రాక్రే ఆటోలో వెళ్తూ.. పోలీసులను చూసి పారిపోయేందుకు ప్రయత్నించారు. పోలీసులు వారిని పట్టుకొని తనిఖీ చేయగా. . సంచుల్లో సుమారు రూ.3.68లక్షల విలువ గల గంజాయి లభించింది. వారిని అదుపులోకి తీసుకొని విచారిస్తున్నారు.

ఫైనల్స్‌కు మహబూబ్‌నగర్, కరీంనగర్ క్రికెట్ జట్లు



అబ్దుల్

వరంగల్ క్రీడావిభాగం, న్యూస్‌టుడే: వరంగల్‌లో జరుగుతున్న రాష్ట్రస్థాయి అండర్-19 క్రికెట్ పోటీల్లో మహబూబ్‌నగర్, కరీంనగర్ జట్లు ఫైనల్స్‌కు చేరుకున్నాయి. హైదరాబాద్ క్రికెట్ సంఘం(హెచ్‌సీఏ) సహకారంతో వరంగల్ క్రికెట్ సంఘం ఆధ్వర్యంలో ఈ పోటీలు జరుగుతున్నాయి. మొగిలిచర్ల మైదానంలో శుక్రవారం జరిగిన సెమీస్‌లో మహబూబ్‌నగర్ జట్టు ఖమ్మంపై 60 పరుగులతో గెలుపొందింది. తొలుత బ్యాటింగ్ చేసిన మహబూబ్‌నగర్ నిర్ణీత 50 ఓవర్లలో 6 వికెట్ల నష్టానికి 234 పరుగులు చేసింది. జట్టులో అబ్దుల్ (110, 136 బంతుల్లో 11×4, 2×6) అద్భుతమైన బ్యాటింగ్‌తో అదరగొట్టాడు. సాహిల్ 45 పరుగులు చేశాడు. ఛేదనలో బ్యాటింగ్‌కు దిగిన ఖమ్మం జట్టు 39.3 ఓవర్లలో 174 పరుగుల వద్ద ఆలౌట్ అయింది. కోమటిపల్లి మైదానంలో జరిగిన కరీంనగర్, నల్గొండ సెమీస్ మ్యాచ్‌ను హైకోర్టు ఉత్తర్వుల ప్రకారం హెచ్‌సీఏ సీఈఓ రద్దు చేశారు. నల్గొండ క్రికెట్ సంఘంలో రెండు వర్గాలకు సంబంధించిన కేసు కోర్టులో ఉంది. ఆ వివాదానికి సంబంధించిన ఉత్తర్వులు శుక్రవారం వెలువడటంతో నల్గొండ జట్టు ఆడిన మ్యాచ్‌ను రద్దు చేసి ప్రత్యర్థి జట్టు కరీంనగర్‌ను విజేతగా ప్రకటించినట్లు వరంగల్ క్రికెట్ సంఘం కార్యదర్శి చాగంటి శ్రీనివాస్ తెలిపారు. శనివారం మొగిలిచర్ల మైదానంలో ఫైనల్స్ మ్యాచ్ ఉంటుందన్నారు.

నేడు బాస్కెట్‌బాల్ జట్ల ఎంపిక

వరంగల్ క్రీడావిభాగం, న్యూస్‌టుడే: హనుమకొండ బాస్కెట్‌బాల్ సంఘం ఆధ్వర్యంలో జిల్లా స్థాయి ఎంపిక పోటీలు నిర్వహిస్తున్నట్లు అధ్యక్షుడు తాళ్లపెల్లి రాజు ఒక ప్రకటనలో తెలిపారు. ఈనెల 5న(శనివారం) కాజీపేటలోని సెయింట్ గాబ్రియల్ ఉన్నత పాఠశాలలో సీనియర్స్ విభాగంలో బాలబాలికలకు ఎంపిక పోటీలు ఉంటాయని తెలిపారు. అర్హత, ఆసక్తి గల హనుమకొండ జిల్లాకు చెందిన క్రీడాకారులు ఆ రోజు సాయంత్రం 4 గంటలకు హాజరుకావాలని కోరారు. పూర్తి వివరాలకు ఫోన్ నంబరు 83284 49263లో సంప్రదించాలని తెలిపారు.

'ఏకశిల' కళాశాలలో బతుకమ్మ వేడుకలు



వేడుకల్లో అధ్యాపకులు, సిబ్బంది, విద్యార్థినులు

నయీంనగర్, న్యూస్‌టుడే: హనుమకొండ హనుమాన్‌నగర్‌లోని ఏకశిల జూనియర్ కళాశాలలో శుక్రవారం బతుకమ్మ వేడుకలు నిర్వహించారు. మహిళా అధ్యాపకులు, విద్యార్థినులు బతుకమ్మలను పేర్చి ఆటపాటలతో సందడి చేశారు. ఛైర్మన్ గౌరు తిరుపతిరెడ్డి వేడుకలను ప్రారంభించారు. కార్యక్రమంలో డైరెక్టర్ ఎం.స్వప్న జితేందర్‌రెడ్డి, ప్రిన్సిపాళ్లు, తిరుపతిరెడ్డి, రాజిరెడ్డి, అధ్యాపకులు, సిబ్బంది పాల్గొన్నారు.

జూడోలో రాణించిన దీపిక



కాంస్య పతకంతో దీపిక

వరంగల్ క్రీడావిభాగం, న్యూస్‌టుడే: జాతీయ స్థాయి జూడో పోటీల్లో నగరానికి చెందిన బాలిక రాణించింది. గుజరాత్‌లోని మెహసానాలో ఈ నెల 3 నుంచి 8 వరకు 68వ జాతీయ స్థాయి ఎస్‌జీఎఫ్ఐ(స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా) జూడో ఛాంపియన్‌షిప్ పోటీలు జరుగుతున్నాయి. మడికొండలోని సోషల్ వెల్ఫేర్ పాఠశాలలో ఎనిమిదో తరగతి చదువుతున్న గుగులోతు దీపిక 23 కిలోల బరువు విభాగంలో బరిలోకి దిగి కాంస్య పతకం కొల్లగొట్టింది. తొలి ప్రయత్నంలోనే జాతీయ స్థాయిలో పతకం సాధించిన దీపికను హనుమకొండ జిల్లా డీఈఓ వాసంతి, ఎస్‌జీఎఫ్ఐ కార్యదర్శి దస్రునాయక్, ఒలింపిక్ సంఘం కార్యదర్శి కైలాస్‌యాదవ్ అభినందించారు.

ఆటో డ్రైవర్లుకు లైసెన్సులు ఇప్పించిన పోలీసులు

వరంగల్‌క్రైం, న్యూస్‌టుడే: నగరంలో డ్రైవింగ్ లైసెన్స్ లేకుండా ఆటో నడుపుతున్న వారికి పోలీసు అధికారులు లర్నింగ్ లైసెన్స్‌లను ఇప్పించారు. వాటిని శుక్రవారం ఆటో డ్రైవర్లకు సీపీ అంబర్ కిషోర్ ఝా అందించారు. గతంలో ట్రాఫిక్ నిబంధనలపై వరంగల్ కమిషనరేట్ ట్రాఫిక్ పోలీసుల ఆధ్వర్యంలో అవగాహన సదస్సు సందర్భంగా పలువురు ఆటో డ్రైవర్లు వారి సమస్యను చెపుకోగా.. స్పందించిన సీపీ రవాణా శాఖ అధికారులతో మాట్లాడి 35 మందికి లైసెన్సులు ఇప్పించారు. ఈ సందర్భంగా అంబర్ కిషోర్ ఝా మాట్లాడుతూ.. ఆటోలో ప్రయాణించే వారిని సురక్షితంగా గమ్యస్థానాలకు చేర్చాల్సిన బాధ్యత డ్రైవర్లపై ఉందన్నారు. కార్యక్రమంలో ట్రాఫిక్ ఏసీపీ సత్యనారాయణ, కాజీపేట ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ నాగబాబు, ఎస్సై ఉమాకాంత్ తదితరులు పాల్గొన్నారు.

గోపాలపూర్ ఊర చెరువు అభివృద్ధికి చర్యలు

గోపాలపూర్, న్యూస్‌టుడే: హనుమకొండలోని 56వ డివిజన్ గోపాలపూర్ ఊర చెరువు అభివృద్ధి పరచి భూగర్భ జలాల పెంపునకు చర్యలు చేపడతామని రాష్ట్ర మత్స్య సహకార కార్పొరేషన్ ఛైర్మన్ మెట్టు సాయికుమార్ అన్నారు. శుక్రవారం సాయంత్రం చెరువును పరిశీలించారు. చెరువు పరిరక్షణపై ప్రజాతంత్ర ఆలోచన వేదిక అధ్యక్షుడు తుపాకుల దశరథం హైకోర్టులో వేసిన పిటిషన్ వివరాలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం సాయికుమార్ మాట్లాడుతూ.. చెరువు అభివృద్ధికి సీఎంతో మాట్లాడి నిధులను కేటాయిస్తామన్నారు. చేపలు పెంచేందుకు చర్యలు తీసుకుంటానిమని తెలిపారు. కార్యక్రమంలో నాయకులు దారబోయిన ప్రణయ్, దశరథం, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

811 చెరువుల్లో చేప పిల్లల పంపిణీ

కాజీపేట, న్యూస్‌టుడే: వరంగల్ నగరంలో ఈ సంవత్సరం 811 చెరువుల్లో ఉచితంగా చేప పిల్లలను వదులుతున్నట్లు పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి వెల్లడించారు. శుక్రవారం ఉదయం పెద్ద వడ్డేపల్లి చెరువులో మత్స్య సహకార శాఖ అధికారులతో కలిసి చేప పిల్లలను వదిలారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ వరంగల్ పశ్చిమ నియోజకవర్గంలో 13.19 లక్షల చేపపిల్లలను 100 శాతం సబ్సిడీపై సరఫరా చేస్తున్నామని అన్నారు. చెరువులకు పూర్వ వైభవం తీసుకొస్తామని అన్నారు. మత్స్య సహకార సొసైటీలు కూడా చెరువుల పరిరక్షణకు పాటుపడాలని కోరారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ వెంకట్‌రెడ్డి, మత్స్యశాఖ ఛైర్మన్ దారబోయిన ప్రణయ్, వైస్ ఛైర్మన్ సిరబోయిన సతీష్, ఐఎన్‌టీయూసీ జిల్లా అధ్యక్షుడు వెంకట్, మత్స్యశాఖ డీడీ శంకర్ రాథోడ్, సంక్షేమ అధికారి నాగమణి పాల్గొన్నారు.

రైస్‌మిల్లర్లు నష్టపోకుండా చూడాలని వినతి

న్యూశాయంపేట, న్యూస్‌టుడే: ఖరీఫ్ సీజన్ ధాన్యం సేకరణకు ప్రభుత్వం చర్యలు చేపడుతున్న నేపథ్యంలో కస్టమ్ మిల్లింగ్ రైస్ (సీఎంఆర్) సందర్భంగా రైస్‌మిల్లర్లు నష్టపోకుండా చూడాలని మిల్లర్ల సంఘం ప్రతినిధులు కోరారు. శుక్రవారం నర్సంపేట, పరకాల, వర్ధన్నపేట ఎమ్మెల్యేలు దొంతి మాధవరెడ్డి, రేవూరి ప్రకాశ్‌రెడ్డి, కేఆర్ నాగరాజు, వరంగల్ కలెక్టర్ సత్యశారదను కలిసి వినతిపత్రాలు అందించారు. ఈ సందర్భంగా వరంగల్ జిల్లా రైస్ మిల్లర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు తోట సంపత్ కుమార్ మాట్లాడుతూ.. ప్రభుత్వం రేషన్‌కార్డు దారులకు సన్న బియ్యం పంపిణీ చేయడం సంతోషకరమని, సన్న ధాన్యం మిల్లింగ్ చేస్తే దిగుబడి 55 నుంచి 60శాతం రావడం వల్ల మిల్లర్లు నష్టపోయే అవకాశం ఉందన్నారు. అందువల్ల జీవోలో మార్పులు చేయాలని కోరారు. గత 12 సీజన్ల నుంచి మిల్లర్లకు రావాల్సిన మిల్లింగ్, కస్టోడియన్ ఛార్జీలు, 2018-19, 2023-24 వరకు సివిల్ సప్లయీస్ రవాణా, ఎఫ్‌సీఐ రవాణా ఛార్జీలు ఇవ్వాలని కోరారు.

రుద్రేశ్వరీదేవికి హంస వాహన సేవ

హనుమకొండ చౌరస్తా, న్యూస్‌టుడే : హనుమకొండలోని చారిత్రక రుద్రేశ్వర వేయిస్తంభాల ఆలయంలో దేవీ శరన్నవరాత్రి ఉత్సవాలు అత్యంత వైభవంగా జరుగుతున్నాయి. రెండో రోజు శుక్రవారం రుద్రేశ్వరీదేవిని గాయత్రిదేవిగా అలంకరించారు. ఐదు రకాల పిండి వంటలను నైవేద్యంగా సమర్పించారు. ఆలయ ప్రధాన అర్చకులు గంగు ఉపేంద్రశర్మ ఆధ్వర్యంలో హంస వాహనంపై ఆలయం చుట్టూ ఊరేగించారు. యాగశాలలో చండీయాగం నిర్వహించి, భక్తులకు మహా అన్నదానం చేశారు. సాయంత్రం సుధీర్‌రావు శిష్య బృందం కూచిపూడి నృత్య ప్రదర్శన అలరించింది.

సంక్షిప్తంగా

కమలాపురం విద్యుత్తు ఏఈ సస్పెన్షన్

ములుగు న్యూస్‌టుడే: విధి నిర్వహణలో అలసత్వం కారణంగా ములుగు జిల్లా మంగపేట మండలం కమలాపురం విద్యుత్తు ఏఈ ప్రశాంత్‌రెడ్డిపై సస్పెన్షన్ వేటు పడింది. ఈ మేరకు సీఎండీ వరుణ్‌రెడ్డి శుక్రవారం సస్పెన్షన్ ఉత్తర్వులు జారీ చేశారు. వివరాలిలా.. మంగపేట మండలం జబ్బోనిగూడెం గ్రామాన్ని గురువారం రాత్రి రాష్ట్ర మంత్రి సీతక్క ఆకస్మికంగా సందర్శించిన సమయంలో కరెంటు లేదు. ఎప్పటి నుంచి సరఫరా నిలిచిందని గ్రామస్థులను అడగ్గా, రెండు రోజులుగా లేదని చెప్పారు. ఆగ్రహించిన మంత్రి అక్కడి నుంచే ఎన్‌పీడీసీఎల్ సీఎండీ వరుణ్‌రెడ్డికి ఫోన్ చేసి ఏఈపై చర్యలు తీసుకోవాలని సూచించడంతో.. ఆయన ఉత్తర్వులు జారీ చేశారు. సస్పెన్షన్‌కు గురైన ఏఈ విధుల్లో చేరి ఏడాదిన్నర మాత్రమే అవుతున్నట్లు సమాచారం.

ఆటో అదుపుతప్పి రైల్వే ఉద్యోగులకు గాయాలు

మడికొండ, న్యూస్‌టుడే: కాజీపేట మండలం మడికొండ శివారు పెద్దమ్మ ఆలయం వద్ద జైజంక్షన్‌లో శుక్రవారం ద్విచక్రవాహనం, ఆటో ఢీకొన్న సంఘటనలో ఇద్దరు రైల్వే ఉద్యోగులకు తీవ్ర గాయాలయ్యాయి. స్థానికుల కథనం ప్రకారం...ఎలుకుర్తి నుంచి మడికొండకు ద్విచక్రవాహనంపై రైల్వే ఉద్యోగులు భాస్కర్, యాదగిరి వస్తుండగా, మడికొండ నుంచి ధర్మసాగర్ వైపు వెళ్తున్న ఆటో వేగంలో అదుపుతప్పి ఢీకొని పక్కనే ఉన్న వ్యవసాయ పొలాల్లోకి దూసుకెళ్లింది. ప్రమాదంలో రైల్వే ఉద్యోగులు గాయపడ్డారు. వారిని 108 వాహనంలో కాజీపేటలోని రైల్వే ఆసుపత్రికి తరలించారు.

నిషేధిత గుట్కా పట్టివేత

వరంగల్‌క్రైం, న్యూస్‌టుడే: దాడులు చేసి అక్రమంగా నిల్వ ఉంచిన గుట్కాను పట్టుకున్నట్లు టాస్క్‌ఫోర్స్ ఏసీపీ ఎ.మధుసూదన్ తెలిపారు. హనుమకొండ ఠాణా పరిధి టైలర్‌స్ట్రీట్‌లోని కమాల్ ఫ్యాన్సీ స్టోర్స్‌కు చెందిన రాజ్‌పురోహిత్ మోహన్‌లాల్ ఇతర ప్రాంతాల నుంచి నిషేధిత గుట్కాను తెచ్చి గోదాంలో దాచి, విక్రయిస్తున్నట్లు సమాచారం రావడంతో టాస్క్‌ఫోర్స్, హనుమకొండ పోలీసులు సంయుక్తంగా దాడులు నిర్వహించారు. సుమారు రూ.5 లక్షల విలువ చేసే గుట్కా స్వాధీనం చేసుకున్నాం. కేసు నమోదు విచారణ కోసం హనుమకొండ పోలీసులకు అప్పగించామని ఏసీపీ తెలిపారు. దాడుల్లో టాస్క్‌ఫోర్స్ ఇన్‌స్పెక్టర్ రంజిత్‌కుమార్, ఎస్సై దిలీప్, హనుమకొండ ఎస్సై పరశురాములు, సిబ్బంది పాల్గొన్నారు.

మడికొండ, న్యూస్‌టుడే: కాజీపేట మండలం మడికొండలో రూ.21వేల విలువ చేసే నిషేధిత గుట్కాలను స్వాధీనం చేసుకున్నట్లు ఇన్‌స్పెక్టర్ పుల్యాల కిషన్ తెలిపారు. హెడ్ కానిస్టేబుల్ జంపయ్య, కానిస్టేబుళ్లు రాజు, నాగేశ్వర్‌రావు పెట్రోలింగ్ చేస్తుండగా కడిపికొండలోని ఓ ప్రైవేటు పాఠశాల సమీపంలో ధర్మసాగర్ మండలం మల్లక్‌పల్లికి చెందిన మోదే సోమనాథం ద్విచక్ర వాహనాన్ని, రెండు సంచులను వదిలి పారిపోతుండగా పట్టుకున్నారు. అదుపులోకి తీసుకొని విచారించగా.. సంచుల్లో గుట్కాలు ఉన్నట్లు గుర్తించారు.

వరంగల్‌క్రైం, న్యూస్‌టుడే: ప్రభుత్వ నిషేధిత గుట్కా కేంద్రాలపై శుక్రవారం రాత్రి టాస్క్‌ఫోర్స్ పోలీసులు దాడి చేశారు. టాస్క్‌ఫోర్స్ ఏసీపీ ఎ.మధుసూదన్ కథనం మేరకు.. .. మట్టెవాడ ఠాణా పరిధిలోని రాజ్‌పురోహిత్ హీరాలాల్‌కు చెందిన ప్రకాశ్ జనరల్ స్టోర్, రాజ్‌పురోహిత్ ఉత్తమ్‌కు చెందిన ఉత్తమ్ కిరాణం దుకాణంలో, హనుమకొండ ఠాణా పరిధిలో టైలర్‌స్ట్రీట్‌లోని సురేష్‌కుమార్ దుకాణంలో, పరకాల ఎర్రం రవీందర్‌కు చెందిన గోదాం, పరకాల బోడ్రాయి రోడ్డులోని పి. సత్యనారాయణకు చెందిన కావ్య కిరాణంలో తనిఖీ చేశారు. మొత్తం రూ.6.29 లక్షల గుట్కా, రూ.12.39 లక్షల విలువ చేసే దీపావళి టపాసుల తయారీకి వాడే మందును స్వాధీనం చేసుకున్నారు. కేసులు నమోదు, విచారణ కోసం ఆయా ఠాణాలకు అప్పగించామని తెలిపారు.

పరకాల నియోజకవర్గం

కుటుంబ వ్యవస్థ బలోపేతానికి కృషి

ఆత్మకూరు, న్యూస్‌టుడే: కుటుంబ వ్యవస్థ బలోపేతానికి సర్వోదయ యూత్ ఆర్గనైజేషన్ కృషి చేస్తోందని ఆర్గనైజేషన్ కార్యదర్శి పల్లెపాడు దామోదర్ అన్నారు. పెద్దాపూర్‌లో శుక్రవారం స్వయం సహాయక బృందాల నాయకులకు లింగాధారిత హింస నివారణ, మహిళా రక్షణ వ్యవస్థలపై అవగాహన కల్పించారు. దామోదర్ మాట్లాడుతూ యువత మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలన్నారు. కార్యక్రమంలో ప్రాజెక్ట్ మేనేజర్ కవిరాజ్, జిల్లా సమైక్య అధ్యక్షురాలు రజిత, క్షేత్రాధికారి రవీందర్, వీవోఏ కవిత, అంగన్‌వాడీ టీచర్ స్వరూప, సీఏలు జయ, వెన్నెల, శ్రీవిద్య, సురేష్ తదితరులు పాల్గొన్నారు..

యువజన సంఘానికి సామగ్రి వితరణ

శాయంపేట, న్యూస్‌టుడే: తహరాపూర్ మాజీ ఉపసర్పంచి కుక్కల భిక్షపతి శుక్రవారం స్థానిక యువ చైతన్య సంఘానికి రూ.40వేల విలువైన ఆంప్లిఫైర్లు, సౌండ్‌బాక్స్‌లను అందజేశారు. కార్యక్రమంలో రేణికుంట్ల సదయ్య, నిమ్మల రమేష్, పున్నం పురుషోత్తంరెడ్డి, పూజారి కొమురయ్య, బండారి పైడి, చందనాల సునీల్, శ్రీనివాస్ పాల్గొన్నారు.

ములుగు డీపీవోకు మంత్రి పరామర్శ

పరకాల, న్యూస్‌టుడే: పరకాలకు చెందిన ములుగు డీపీవో ఒంటేరు దేవరాజును శుక్రవారం పరకాలలో మంత్రి సీతక్క పరామర్శించారు. ఇటీవల దేవరాజు తండ్రి సారయ్య మృతి చెందారు. సీతక్క సారయ్య చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు.



దేవరాజు కుటుంబ సభ్యులను పరామర్శిస్తున్న మంత్రి సీతక్క

కాంగ్రెస్ పట్టణ అధ్యక్షుడు కొయ్యడ శ్రీనివాస్ తదితరులు ఉన్నారు.

జలాశయంలో చేపల వేటపై వివాదం

శాయంపేట, న్యూస్‌టుడే: శాయంపేట మండలం జోగంపల్లి శివారులోని చలివాగు ప్రాజెక్టులో చేపల వేటపై వివాదం నెలకొంది. ప్రాజెక్టు పరిధిలోని మత్స్యకారుల సంఘంలో 13 గ్రామాలకు చెందిన 1,276 మంది సభ్యులు ఉన్నారు. ప్రభుత్వం ఏటా ప్రాజెక్టులో ఉచితంగా చేప పిల్లలను పోస్తూ మత్స్యకార్మికులను ప్రోత్సహిస్తోంది. కొత్తగా ఎన్నికైన మత్స్యసంఘం పాలకవర్గం ఛైర్మన్ గండి రాజమౌళి చేపలు పట్టే హక్కులను గుత్తేదారుడికి అప్పగించేందుకు ప్రయత్నించడంతో కొందరు డైరెక్టర్లు, మత్స్యకార్మికులు విభేదించారు. చేపలు పట్టుకొని ఉపాధి పొందుతున్న తమ పొట్టగొట్టేందుకు కుట్రలు చేస్తున్నారని మండిపడుతున్నారు. ఈ క్రమంలో ఛైర్మన్, కొందరు డైరెక్టర్లు, కొందరు సభ్యులు కలిసి సొంతంగా కొనుగోలు చేసిన చేప పిల్లలను గురువారం చలివాగు ప్రాజెక్టులో పోశారు. 9 నెలల వరకు చేపలు పట్టొద్దని, అనంతరం పాలకవర్గమే పట్టించి.. డబ్బులను సభ్యులందరికీ పంచుతామని చెప్పారు. దీంతో రెండు వర్గాల మధ్య విభేదాలు నెలకొన్నాయి. మత్స్య కార్మికులు ఈ విషయాన్ని ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు దృష్టికి తీసుకెళ్లారు. అధికారులు రెండు రోజుల్లో ఉచితంగా చేప పిల్లలను పంపిణీ చేయనున్నారు.

పెండింగ్ పనులు పూర్తి చేయాలి



తరగతి గదులను పరిశీలిస్తున్న ప్రత్యేకాధికారి రాజమణి

శాయంపేట, న్యూస్‌టుడే: మన ఊరు-మన బడి కార్యక్రమంలో పెండింగ్‌లో ఉన్న పనులను పూర్తి చేయాలని మండల ప్రత్యేకాధికారి రాజమణి కోరారు. శాయంపేట మండలం పెద్దకోడెపాక ప్రభుత్వ ఉన్నతపాఠశాలను శుక్రవారం ఆమె తనిఖీ చేశారు. తరగతి గదులను పరిశీలించారు. శాయంపేట, పత్తిపాక, మైలారం గ్రామాల్లోని బతుకమ్మ వేడుకల స్థలాలను పరిశీలించి సూచనలు చేశారు. కార్యక్రమంలో ఎంపీడీవో ఫణిచంద్ర, ఎంపీవో రంజిత్‌కుమార్, విద్యాశాఖ డీఈఈ రవీందర్, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

పాతకక్షలతో యువకుడిపై దాడి

శాయంపేట, న్యూస్‌టుడే: పాతకక్షలతో ఓ యువకుడిపై దాడికి పాల్పడిన సంఘటన శాయంపేట మండలం కాట్రపల్లిలో గురువారం రాత్రి చోటు చేసుకుంది. ఎస్సై ప్రమోద్‌కుమార్ కథనం ప్రకారం.. గ్రామానికి చెందిన మిరియాల నరేష్ గురువారం భూపాలపల్లికి వెళ్లి ఇంటికి తిరిగి వచ్చాడు. ఎదురుగా ఉన్న ఇంటిలో ఉంటున్న బందెల శ్రీకాంత్, గడ్డం కుమార్, రాజేశ్వర్, చరణ్, మహేశ్వరిలు నరేష్‌పై దాడి చేసి కొట్టారు. చరణ్ చాకుతో పొడిచాడు. బాధితుడి ఫిర్యాదు మేరకు శుక్రవారం ఐదుగురు నిందితులపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.